ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 3
మంగళవారం 29 జూలై 2025



నాగుల పంచమికి సర్వం సిద్ధం 5





రిజర్వేషన్‌పై ఉత్కంఠ

- ఎంపీటీసీ నుంచి జడ్పీ చైర్మన్ దాకా..
- స్థానిక ఎన్నికల దిశగా సంకేతాలు
- పోటీలో ఉంటామంటూ మొదలైన ప్రచారం
- జిల్లాలో కొత్తగా 3 మండల పరిషత్‌లు

ఊగిసలాటలో ఆశావహులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట)

ముందుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని సంకేతాలు వస్తున్న నేపథ్యంలో ఆ దిశగా ఆశావహులు అడుగులేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తామంటూ ప్రచారానికి సిద్ధమవుతున్నారు. పాత రిజర్వేషన్లే ఉంటాయా.. కొత్త రిజర్వేషన్ల ప్రకారం నిర్వహిస్తారా అనే విషయంపై మీమాంస నెలకొంది. అందుకే ఎంపీటీసీ నుంచి జడ్పీ చైర్మన్ రిజర్వేషన్ దాకా ఉత్కంఠ తప్పడం లేదు. రిజర్వేషన్లు అటు ఇటైతే పెట్టుబడి ఆగమవుతుందని ఆశావహులు ఊగిసలాటలో ఉన్నారు.

జిల్లాలోని 26 మండలాల్లో 230 ఎంపీటీసీ స్థానాలు, 26 జడ్పీటీసీ స్థానాలు, 508 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గత ఏడాది మే నెలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్‌ల పదవీ కాలం ముగిసింది. 2024 ఫిబ్రవరిలోనే సర్పంచ్‌లు, వార్డు సభ్యుల గడువూ పూర్తయ్యింది. ఈ రెండు ఎన్నికలను నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సెప్టెంబరు 30లోపు ఎన్నికల ప్రక్రియను ముగించాలని



మిగతా 6వ పేజీలో

జడ్పీచైర్మన్ ఎటో..

సిద్దిపేట జిల్లా ఏర్పడిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో ఈ స్థానాన్ని బీఆర్ఎస్ దక్కించుకుంది. నాడు జనరల్ కోటాలో మహిళకు అవకాశం దక్కింది. ఈసారి రిజర్వేషన్ ఎలా ఉంటుందోననే ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే పలువురు ఆశావహులు జనరల్ కోటాపై నమ్మకం పెట్టుకొని తమ మండలాల్లో దృష్టి సారించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైనవారు, టికెట్ దక్కనివారు ఈ రేసులో ఉన్నారు. 26 మండలాల్లో ప్రొటోకాల్‌తోపాటు సహాయ మంత్రి హోదా కూడా ఉండటంతో పలువురు ఈ పదవిపై కన్నేశారు. ఆర్థికంగా బలంగా ఉన్న పలువురు జడ్పీ చైర్మన్ సీటులో కూర్చోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. పార్టీల పరంగా 14 సీట్లు గెల్చుకున్న పార్టీ జడ్పీటీసీ సభ్యుడికే ఈ అవకాశం ఉంటుంది. ఇక ఆయా మండలాల జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లపై ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

వారంలో ఫుల్ వాటర్

- కూడవెల్లి వాగుపై పూర్తయిన పైపులైన్
- దుబ్బాక, గజ్వేల్‌లకు తీరనున్న తాగునీటి సమస్య
- యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్న అధికారులు

మల్లన్నసాగర్ నుంచి కోమటిబండకు తాగునీరు

గజ్వేల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మరో వారం రోజుల్లో గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు తాగునీటి ఇబ్బందులు దూరం కానున్నాయి. ఏళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడ్డ ఈ నియోజకవర్గాల్లో ఇక గొంతు ఎండే పరిస్థితి ఉండదు. 2015లో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యలు తీరినప్పటికీ, హెచ్ఎండబ్ల్యుఎస్ ద్వారా నీటిని తరలించడం ద్వారా వేసవి కాలంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇకపై ఇబ్బందులు లేకుండా తాగునీటిని అందించాలని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా మల్లన్నసాగర్ నుంచి ప్రత్యేక టాపింగ్ పాయింట్ ద్వారా కుకునూరుపల్లి మండలం మంగోల్ వద్ద నిర్మించిన భారీ తాగునీటి శుద్ధి జలాశయం నుంచి అక్కారం పంప్ హౌస్‌కు నీటిని చేర్చనున్నారు. అక్కడి నుంచి నేరుగా పైప్‌లైన్ ద్వారా కోమటిబండ జీఎల్బీఆర్‌కు తరలిస్తారు. కోమటిబండ నుంచి గ్రావిటీ ద్వారా ఆయా గ్రామాలకు తాగునీరు అందనుంది. ఈ మంగోల్ రిజర్వాయర్ నుంచి చేపట్టిన 16 కిలోమీటర్ల పైప్‌లైన్‌లో రైల్వే క్రాసింగ్, కూడవెల్లి వాగు క్రాసింగ్‌ల వద్ద పనులు కొంత ఆలస్యమయ్యాయి. కూడవెల్లి వాగుపై దాదాపుగా రెండు నెలలుగా పనులు చేపట్టినప్పటికీ వర్షాల కారణంగా నెమ్మదిగా సాగాయి. కేవలం 400 మీటర్ల పైప్‌లైన్ నిర్మాణానికి 20 రోజుల వ్యవధి పట్టింది. ఈ క్రమంలో అధికారులు శ్రమించి పనులను పూర్తి చేశారు.

రెండు రోజుల్లో ట్రయల్ రన్

మంగోల్ భారీ తాగునీటి శుద్ధి జలాశయం నుంచి అక్కారం వరకు నిర్మించిన 16 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో రెండు రోజుల్లో ట్రయల్ రన్ పూర్తిచేసి, మరో రెండు రోజుల్లో నీటిని కోమటిబండకు పంపింగ్ చేయనున్నారు. ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే తప్ప వచ్చే సోమవారం నుంచి పూర్తిస్థాయిలో తాగునీరు ప్రజలకు అందనుంది. సాంకేతిక లోపం తలెత్తితే మరో వారం రోజుల వరకు సమయం పట్టే అవకాశం ఉంది. పైప్‌లైన్ నిర్మాణ పనులను మిషన్ భగీరథ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. వాస్తవానికి ఈనెల 25న పైప్‌లైన్ పూర్తి చేసి, నీటిని అందించాలన్న కృతనిశ్చయంతో అధికారులు పనిచేసినప్పటికీ నాలుగైదు రోజులపాటు కురిసిన వర్షాలతో కొంత ఇబ్బంది ఏర్పడింది. అయినప్పటికీ అధికారులు ఎక్కడ నిర్లక్ష్యం వహించకుండా పనులను చేపడుతున్నారు. సమీప భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి నీరు ప్రజలకు అందనుంది.



గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద కూడవెల్లి వాగుపై పూర్తయిన పైప్‌లైన్

జాతీయ మానవ హక్కుల కమిషన్
బహిరంగ విచారణ
ఒకే రోజులో రెండు డివిజన్ బెంచీలపై 100కు పైగా కేసులు 5



కుటుంబ గొడవల్లో అత్తను చంపిన అల్లుళ్లు 4

రా.. రమ్మని..





కొమురవెల్లి మల్లన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అందమైన చిత్రాలు ఆహ్వానం పలుకుతున్నాయి. స్వామి వారి చెంతకు చేరే వారికి దూరం నుంచే ప్రశాంతత చేకూరుస్తున్నాయి. రాజీవ్ రహదారి స్వాగత తోరణం సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి గోడలపై ఇలా అందమైన చిత్రాలు వేయగా, భక్తులను.. స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. -(ఆంధ్రజ్యోతి-కొమురవెల్లి)



రూ. 4 కోట్లు..! ఎరువు బరువు

జిల్లాలో 5.60 లక్షల ఎకరాల్లో సాగు

- 93 వేల మెట్రిక్ టన్నుల ఎరువు అవసరం
- ఏటా పెరుగుతున్న ధరలతో రైతు బెంబేలు
- నానో ఎరువులపై అవగాహన కరువు

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ఎరువుల ధరలు రైతు నడ్డివిరుస్తున్నాయి. సాగు ఖర్చులతో పాటు ఎరువుల ధరలూ పెరగడంతో కొందరు రైతులు కాడి కింద పడేస్తున్నారు. ఏటా పెరుగుతున్న ధరలతో సతమతమవుతున్నారు. జిల్లాలో వానాకాలం సాగుచేసే వివిధ రకాల పంటలకు 93 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అని అంచనా వేశారు. ఇందులో యూరియా, డీఏపీ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. 28-28-0, డీఏపీ, యూరియా మినహా మిగతా వాటి ధరలు రూ. 50నుంచి రూ. 330వరకు పెరిగాయి. యూరియా, డీఏపీల ధరలు పెరగకున్నా.. కొందరు లింకు ఎరువులను రైతులకు అంటగడుతున్నాయి. లేకపోతే యూరియా, డీఏపీలను విక్రయించబోమని చెబుతున్నారు.

రైతుపై అదనపు భారం....

ఈ వానాకాలం సీజన్లో 5.60 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేశారు. ఈ మేరకు యూరియా 40 వేల మెట్రిక్ టన్నులు, డీఏపీ 6,440 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 3041.07 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 43,777.32 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 675 మెట్రిక్ టన్నులు మొత్తం 93,926.389 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరపడతాయని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఈ లెక్కన కేవలం ఈ వానాకాలం సీజన్లోనే జిల్లా రైతాంగానికి రూ. 4 కోట్లు పైగానే అదనపు భారం పడనుంది.

నానోలపై అనాసక్తి..

మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల సాగు చేపడితే మేలు చేకూరుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం యూరియా స్థానంలో నానో యూరియాను తీసుకొచ్చింది. ధర తక్కువగా ఉండే నానో ఎరువుల వినియోగంతో రైతులకు పెట్టుబడుల భారం తగ్గి.. దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. రెండేళ్ల క్రితమే నానో యూరియా మార్కెట్‌లోకి వచ్చినప్పటికీ రైతులు మాత్రం ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం వాడుతున్న సాధారణ యూరియాను పంటకు చల్లడం ద్వారా కేవలం 30 శాతం మాత్రమే పంటకు వెళ్తుందని అధికారులు పేర్కొంటున్నారు. నానో యూరియా 80 శాతం పంటకు వెళ్తుందని చెబుతున్నారు. అర లీటర్‌లో లభించే నానో యూరియా 45 కిలోల బస్తాతో సమానం. సబ్సిడీ పోనూ యూరియా బస్తా ధర రూ. 266.50ఉండగా, నానో యూరియా రూ. 240కే లభిస్తుంది. యూరియా తర్వాత రసాయన నానో డీఏపీని అందుబాటులోకి తెచ్చారు. ఒక బస్తా డీఏపీ 500 మిల్లీలీటర్ల నానో డీఏపీతో సమానం. బస్తా డీఏపీ ధర రూ. 1,350 ఉండగా.. నానో డీఏపీ రూ. 600 లభిస్తుంది. నానో ఎరువుల వినియోగంతో కలిగే లాభాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఎరువుల ధరలు రూ... (50కేజీలలో బస్తా)

ఎరువు పేరు	పాత ధర	కొత్త ధర
20-20-0-13(ఫ్యాక్ట్)	1300	1425
20-20-0-13(గ్రోమోర్)	1300	1350
పొటాష్	1535	1800
20-20-0-13(పీపీఎల్)	1300	1400
10-26-26	1470	1800
12-32-16(ఇఫ్కో)	1470	1720
16-16-16	1450	1600
14-35-14 (గ్రోమోర్)	1700	1800
సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్	580	640

చిరుత కాదది..తోడేలు

- తేలిపోయిన రైతుల భయం

దుబ్బాక/మిరుదొడ్డి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు చిరుత భయంతో వారు వ్యవసాయ పనులకు దూరంగా ఉన్నారు. ఒంటరిగా బయటికి వచ్చేందుకు జంకేవారు. పిల్లలను అస్సలు బయటకు రానిచ్చేవారు కాదు. కానీ, ఆ భయం ఇప్పుడు తొలగిపోయింది. దుబ్బాక అటవీ ప్రాంత పరిధిలోని మిరుదొడ్డి, దౌల్తాబాద్ మండల సరిహద్దులో కొన్నాళ్లుగా చిరుత సంచారంపై నెలకొన్న భయం సోమవారం దూరమైంది. సమీప రైతుల పశువుల పాకల వద్ద పశువులపై దాడిచేస్తున్నది చిరుతపులి కాదని, తోడేలుగా గుర్తించినట్టు అటవీశాఖ క్షేత్రాధికారి సదీప్‌కుమార్, సెక్షన్ అధికారి మల్లేశంలు తేల్చిచెప్పారు. ఈనెల 19న జంగపల్లిలోని అటవీ ప్రాంతానికి సమీపంలోని మల్లేశం అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో మేకలను తిన్న తోడేలు పాదాల ముద్రను చూసి, మొదట చిరుతపులిగా భావించారు. దీనిపై పూర్తి నిర్ధారణ రావాలనే ఉద్దేశంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సోమవారం వాటిని పరిశీలించగా సీసీ కెమెరాలో తోడేలు కనిపించింది. దీంతో ఇన్నాళ్ల చిరుతగా భావించిన జంతువు తోడేలుగా నిర్ధారణకు వచ్చారు. తోడెలు సమీప దొమ్మాట అటవీ ప్రాంతంలోని గాజులపల్లి, అల్మాస్‌పూర్, జంగపల్లి వ్యవసాయ పొలాల వద్ద తిరిగి, భయాందోళన కలిగించింది. పదిరోజులుగా చిరుతపులి సంచరిస్తుందనే భయంతో రైతులు వ్యవసాయ పనులకు కూడా వెళ్లకుండా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకున్నారు. పశువులను వ్యవసాయ క్షేత్రాల వద్ద పశువుల పాకలో ఉంచకుండా ఇంటివద్దనే ఉంచారు. అటవీశాఖ అధికారులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నది చిరుతపులి కాదని సోమవారం అవగాహన కల్పించడంతో రైతులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.



సీసీ కెమెరాకు చిక్కిన తోడేలు



అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి

ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట/ సిద్దిపేట రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి సూచించారు. సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతా ల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో భాగంగా 120 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు. అలాగే, కలెక్టరేట్‌లో జిల్లా ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. టీజీ ఐపాస్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆయా శాఖల వారీగా ధ్రువీకరించాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణేష్‌రాం, ఏల్డీఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పొన్నాల శివారు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ బాలిక గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువు పెంపు

సిద్దిపేట కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్ గడువు పొడిగించారు. ఆగస్టు 13 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అడ్మిషన్ పొందవచ్చని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిద్దిపేట రీజనల్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రద్ధానందం తెలిపారు. ఇంటర్మీడియట్, ఓపెన్ స్కూల్ సొసైటీ, పాలిటెక్నిక్, ఐటీఐ, 10 ప్లస్ 2 వంటి తత్సమాన కోర్సుల్లో పాసైన వారు డిగ్రీలో అడ్మిషన్ తీసుకోవడానికి అర్హులని తెలిపారు. డిగ్రీ తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారు పీజీ కోర్సులకు అర్హులని చెప్పారు. అడ్మిషన్ల కోసం టీఎస్ ఆన్‌లైన్, మీసేవా, యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని రిజిస్ట్రేషన్ ఫారంతోపాటు సంబందించిన ఒరిజినల్స్, జిరాక్స్ సర్టిఫికెట్స్‌తో అభ్యాసకుల సహాయ కేంద్రంలో వెరిఫికేషన్ పూర్తిచేసుకోవాలన్నారు. తరువాత సంబంధిత కోర్సు ఫీజు చెల్లించాలని చెప్పారు. పూర్తి వివరాలకు సిద్దిపేట అభ్యాసకుల సహాయ కేంద్రంలో కానీ, 73829 29615 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రామవ్వకెంత కష్టం..!

- పింఛన్ కోసం 50 కిలోమీటర్ల ప్రయాణం
- నడవలేక ఆటోలో.. సగం పింఛన్ అటే..

గజ్వేల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆమెకు ఆసరాగా ఉంటుందని పింఛన్ మంజూరు చేసింది. కానీ, దానిని అందుకునేందుకు ఆమె ఏకంగా 50 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. వచ్చే పింఛన్‌లో ప్రయాణ ఖర్చులే సగం అవుతుండగా, మిగిలిన డబ్బులు ఆమెకు ఏ మాత్రం ఆసరా ఇవ్వలేకపోతున్నాయి. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డుకు చెందిన జంగపల్లి రామవ్వ భర్త జంగపల్లి బాలయ్య మరణించారు. రామవ్వ 2023 ఫిబ్రవరిలో చేయూత పింఛన్‌కు అర్హత పొందింది. ఆమె ఇంటిపేరు 'జంగపల్లి'గా ఉండడంతో అధికారులు 'జంగంపల్లి'గా అర్థం చేసుకొని, పింఛన్‌ను జంగంపల్లి పక్కన ఉండే చేర్యాపూర్ పోస్టాఫీస్‌కు బదిలీ చేశారు. ఈ విషయమై రామవ్వ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయాన్ని ఎన్నో సార్లు సంప్రదించినా, ఎవరు పట్టించుకోలేదు. అంతదూరం వెళ్లేందుకు



పింఛన్ కాగితాలతో రామవ్వ

మిగతా 6వ పేజీలో

నిండు గర్భిణికి ఎంత శోకం

● చేపలు పట్టేందుకు వెళ్లిన భర్త నీట మునిగి మృతి




ప్రవీణ్ మృతదేహం, రోదిస్తున్న భార్య లలిత

తూప్రాన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల్లో ప్రసవం.. అంతలోనే భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో భార్య గుండెలవిసేలా రోదించింది. అయ్యో దేవుడా ఎందుకీ శిక్ష అంటూ బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. చెరువులో చేపలు పట్టే క్రమంలో ప్రమాదశవాత్తు వ్యక్తి నీట మునిగి మృతిచెందిన సంఘటన తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాపన్నపేట మండలం నార్సింగి గ్రామానికి చెందిన టంటం ప్రవీణ్ (25), లలిత దంపతులకు నాలుగేళ్ల అశ్విన్, ఏడాదిన్నర కూతురు అమ్ములు సంతానం. ప్రస్తుతం లలిత నిండు చూలాల గర్భిణి కాగా, ఆగస్టు 1న ప్రసవం జరగనుందని వైద్యులు తెలిపారు. జీవనోపాధి కోసం నెల రోజుల క్రితం కటుంబంతో కలిసి తూప్రాన్ పట్టణానికి వచ్చి పోతరాజుపల్లిలోని గీతారెడ్డి కాలనీలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. సోమవారం పనులు లేకపోవడంతో అల్లాపూర్ శివారులోని తిమ్మాయి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో జారి చెరువులో పడిపోయాడు. పక్కనే ఉన్న బండరాయిని పట్టుకొని మరో ప్రయత్నం చేసినప్పటికీ మళ్లీ జారి చెరువులో పడి గల్లంతయ్యాడు. అక్కడే చేపలు పడుతున్న మరో వ్యక్తి సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ గొడవల్లో అత్తను చంపిన అల్లుళ్లు

మద్దూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో తలెత్తిన గొడవల కారణంగా అల్లుళ్లు అత్తను నరికి చంపారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజర గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బంజర గ్రామానికి చెందిన జంగిలి యాదగిరి వజ్రమ్మ దంపతుల కూతురు భవానీని ధర్మారం గ్రామానికి చెందిన జక్కుల కనకయ్య కుమారుడు మహేష్‌కు ఇచ్చి తొమ్మిదేళ్ల క్రితం పెళ్లి చేశారు. వీరు అమీన్‌పూర్‌లో అత్తామామలతో కలిసి ఉంటున్నారు. మహేష్, భవానీలకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కొద్ది సంవత్సరాల నుంచి మహేష్ భవానీల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మహేష్‌పై మద్దూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధర్మారంలో పెద్ద మనుషుల మధ్య మాట్లాడుకుని కేసు విషయంలో కాంప్రమైజ్ అయ్యారు. యాదగిరి, వజ్రమ్మలు తమ కూతురును భర్తతో పంపించకుండా బంజరకు తీసుకెళ్లారు. ఆదివారం వారిద్దరు తమ కుమార్తెతో పాటు మనుమరాండ్లను, మనుమడిని ధర్మారంలోని అత్తగారి ఇంటికి తీసుకువచ్చారు. అల్లుడు ఇంటి దగ్గర లేకపోవడంతో అల్లుడు వచ్చే వరకు ఉండమని భార్య వజ్రమ్మకు చెప్పి భర్త యాదగిరి బంజరకు వచ్చారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న మహేష్ 'ఇక్కడ ఎందుకున్నావ్.. వెళ్లిపో' అంటూ వెళ్లగొట్టాడు. దీంతో వజ్రమ్మ బంజరకు చేరుకుంది. అంతకు ముందే మహేష్ ఫోన్ చేసి మామ దగ్గర నుంచి ఇంటి తాళం చెవి తీసుకున్నాడు. విషయాన్ని యాదగిరి భార్యకు చెప్పగా, ఇంట్లో వస్తువులు పోతే ఎలా అని ప్రశ్నించింది. ఈ విషయం తెలిసి ఆగ్రహంతో ఊగిపోయిన మహేష్ తన తమ్ముడు హరీష్‌తో కలిసి మధ్యాహ్నం అత్తగారి గ్రామమైన బంజరకు చేరుకున్నారు. వజ్రమ్మ.. జంగిలి మల్లేష్ ఇంటి వద్ద ఉండగా, తాళం చెవి ఇచ్చేందుకు వచ్చానంటూ అత్తతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో హరీష్ వజ్రమ్మను గట్టిగా పట్టుకోగా, మహేష్ వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెను నరికి చంపి ఇరువురు పరారయ్యారు. అక్కడే ఉన్న వారు అరుస్తూ పరుగులు పెట్టరు. తర్వాత వచ్చి చూడగా వజ్రమ్మ రక్తం మడుగులో పడి ఉంది. గ్రామస్థులు మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ అలీ సిబ్బందితో వచ్చి, అక్కడి నుంచి గ్రామస్థులను పంపించారు. ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తుగా ధర్మారంతో పాటు బంజరలో బందోబస్తు ఏర్పాటు చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అంతకు ముందు సంఘటనా స్థలాన్ని హుస్నాబాద్ సీఐ కొండ శ్రీను, చేర్యాల ఎస్సై నవీన్, కొమురవెల్లి ఎస్సై రాజు పరిశీలించారు.



కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

నర్సాపూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో యువజన కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ లింగంకు ఫిర్యాదు ఇచ్చిన సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన స్థాయి మరిచి సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఆరోపించారు. కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా తన సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పట్టించుకోకుండా తన రాజకీయ పబ్బం కోసం అనవసరపు రాద్ధాంతం చేస్తున్నాడన్నారు. సీఎంపై ఇష్టానుసారంగా మాట్లాడిన కౌశిక్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పోలీసులను కోరారు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

● ఒకరి దుర్మరణం, ఇద్దరికి తీవ్ర గాయాలు



కర్రె జశ్వంత్ (ఫైల్)

చిన్నశంకరంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అతివేగంతో ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన కర్రె జశ్వంత్, మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన మత్తడి రమేష్, రుద్రారం గ్రామానికి చెందిన చాకలి రాములు మెదక్‌లో ఒక కార్యక్రమానికి వెళ్లి, ఎర్టిగా కారులో ఇంటికి తిరిగి ప్రయాణిస్తున్నారు. చిన్నశంకరంపేట వద్ద అతివేగంతో వస్తున్న కారు అదుపుతప్పి మెదక్-చేగుంట రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో జశ్వంత్ (18) అక్కడికక్కడే మృతి చెందాడు. మత్తడి రమేష్, చాకలి రాములుకు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స కోసం స్థానికుల సహాయంతో 108 అంబులెన్సులో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి జశ్వంత్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిత్తూరులో చేర్యాల యువకుడి దుర్మరణం



బొడ్డు భరత్ (ఫైల్)

చేర్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకటేశ్వరుడి దర్శనం కోసం వెళుతూ చేర్యాల పట్టణానికి చెందిన బొడ్డు భరత్ (20) చిత్తూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే, పట్టణానికి చెందిన భరత్ హైదరాబాద్‌లో బీబీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. తోటి మిత్రులతో కలిసి రెండు రోజుల క్రితం కారులో తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరారు. ముందుగా అన్నవరం, తమిళనాడు రాష్ట్రంలోని గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని ఆదివారం రాత్రి తిరుమలకు పయనమయ్యారు. చిత్తూరు జిల్లా శివారులో ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో భరత్ ఘటనాస్థలంలోనే మృతి చెందగా, మిగతావారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికంగా ఆస్పత్రిలో చేర్పగా, చికిత్స పొందుతున్నారు. భరత్ మరణవార్త విని తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని తీసుకురావడానికి వారు బయలుదేరి వెళ్లారు.

టిప్పర్ ఢీకొన్ని వాచ్‌మన్..

పటాన్‌చెరు జూలై 28 (ఆంధ్రజ్యోతి) : టిప్పర్ ఢీకొని ఓ వాచ్‌మెన్ దుర్మరణం పాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం బచ్చుగూడ గ్రామానికి చెందిన రామిరెడ్డి (54) జీఎంఆర్ మకుట అనే సంస్థలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం డ్యూటీకి వెళ్తున్నానంటూ మధ్యాహ్నం మోటారు సైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి ఇన్నోవా కారు ఎడమవైపు ఢీకొట్టింది. అదే సమయంలో కుడి వైపు నుంచి ఇంద్రేశం నుంచి పటాన్‌చెరు వెళ్తున్న టిప్పర్ వేగంగా ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలయిన రామిరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు..



జగన్నాథం (ఫైల్)

హవేళిఘనపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒక కౌలు రైతు మృతి చెందిన సంఘటన వాడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి: గ్రామానికి చెందిన ఆకుల జగన్నాథం (50) తన భూమితోపాటు ఇతరుల నుంచి రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సోమవారం తన కొడుకు శివతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. శివ పొలంలో నీళ్లు చూస్తుండగా, జగన్నాథం బోరుమోటారు నడవకపోవడంతో స్టార్టర్‌లో మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఒడ్డుపై నుంచి జారిపడి యువరైతు..



జగన్నాథం (ఫైల్)

మిరుదొడ్డి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఒడ్డుపై నుంచి జారిపడి యువ రైతు మృతి చెందిన సంఘటన సోమవారం మిరుదొడ్డిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ సమత తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన చెక్క భిక్షపతి (38) వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఒడ్డుపై నుంచి నడుస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బురదలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమీప రైతులు చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య బాలలక్ష్మి, ముగ్గురు పిల్లలున్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భూ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన మల్లేశం

గజ్వేల్ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలతో క్రిమి సంహారక మందు సేవించి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గజ్వేల్ పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ప్రజ్ఞాపూర్‌కు చెందిన శ్రీరామ్ మల్లేశం(59) గజ్వేల్‌లోని లక్ష్మీప్రసన్న కాలనీలో భూమి విషయంలో పక్కన ఉన్నవారితో రెండు నెలల నుండి గొడవలు జరుగుతున్నాయి. తీవ్ర మనస్తాపం చెంది సోమవారం గజ్వేల్ పట్టణంలోని సాయిబాబ దేవాలయం వద్ద క్రిమిసంహారక మందు సేవించి పడిపోయాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సాచారం ఇవ్వగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మల్లేశంని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

చిలప్‌చెడ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాము కాటు వేయడంతో ఒక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సోమవారం మండలం పరిధిలోని చండూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చండూరు గ్రామానికి చెందిన ఊట్ల సత్తెమ్మ (75) ప్రతిరోజు లాగే ఇంట్లో పడుకొని ఉండగా అర్ధరాత్రి ఆమె కుడి కాలు మధ్య వేలికి పాము కాటు వేసింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపగా వారు ఆమెను ఆటోలో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి కుమారుడు ఊట్ల దత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

చేర్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చిట్యాల గ్రామానికి చెందిన వంకాయల ఓజయ్యకు చెందిన ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రోజులాగే సోమవారం బావి పరిసరాలలో గడ్డి మేస్తుండగా విద్యుత్ వైర్ తగిలి షాక్‌కు గురై మరణించింది. సుమారు రూ.90 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఓజయ్య వేడుకుంటున్నాడు.

కేసీఆర్ గడిలో.. రేవంత్ బంగ్లాలో పుట్టాడు

● నాకు పేదల బాధలు తెలుసు... దివ్యాంగుల పెన్షన్ పెంచాలి

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



దివ్యాంగురాలిని ట్రై సైకిల్‌పై సభాస్థలికి తీసుకువస్తున్న మందకృష్ణ

మెదక్ కల్చరల్/సంగారెడ్డి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ గడిలో, రేవంత్‌రెడ్డి బంగ్లాలో పుట్టాడని, నేను పేదరికంలో పుట్టానని, అందుకే పేదల సమస్యలపై పోరాడుతున్నానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడే రూ. 200 పింఛన్లపై పోరాడి రూ.500 పింఛన్ సాధించిన ఘనత ఎమ్మార్పీఎస్‌కే దక్కిందన్నారు. ఎమ్మార్పీఎస్ పేదలకోసం ఎప్పుడైతే రోడ్డు పైకి వస్తుందో అప్పుడే పింఛన్‌లు పెరుగుతున్నాయని, అందుకోసమే మళ్లీ ఒక్క సారి మీ కోసం ముందుకు వచ్చానన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో దివ్యాంగుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు పింఛన్ పెంచుతుతామని చెప్పి మాట ఇచ్చి నేటికి అమలు చేయలేదన్నారు. ఏపీలో అక్కడి సీఎం చంద్రబాబును కలిసి పెన్షన్ పెంచాలని కోరితే, కండర క్షీణత ఉన్నవారికీ కలిపి పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం పెంచి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పెన్షన్లు పెంచి ఇవ్వకపోవడంతో ఒక్కో దివ్యాంగుడు రూ. 40 వేలు నష్టపోయారని అన్నారు. దివ్యాంగుల నిధులను రైతు రుణమాఫీకి ఖర్చు చేశారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బీఆర్ఎస్ మౌనంగా ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా జిల్లా ఇన్‌చార్జి దండు శంకర్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాచుపల్లి పాండు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి కుమార్, సంధి గల భూమయ్య, డీలర్ యాదగిరి లక్ష్మీనరసమ్మ, శ్రీనివాస్ సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు అస్తరుగల్ల బాలరాజు, బొజ్జ సైదులు, బంజూరు విజయ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌లు ఇస్తవా.. రాజినామ చేస్తవా

మహిళలకు ఆగస్టు 11 వరకు పింఛన్‌లు ఇస్తవా.. రాజీనామా చేసి వెళ్లిపోతావా సీఎం రేవంత్‌రెడ్డి తేల్చుకోవాలని మంద కృష్ణమాదిగ అన్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన మహాగర్జన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వచ్చే రూ. 2వేల పించన్‌లు కూడా సక్రమంగా వేయకుండా మహిళలను వంచించారని విమర్శించారు. ఎస్సీ రిజర్వేషన్ విషయంలో కూడా రేవంత్‌రెడ్డి మాట మార్చి ఆ నెపాన్ని కేంద్రంపై మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శాయిబాజ్ మృతదేహం లభ్యం

పాపన్నపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి) : మిత్రులతో కలసి చేపల వేటకు వెళ్లిన బాచారం గ్రామానికి చెందిన శాయిబాజ్ ఆదివారం ముద్దాపూర్ బ్రిడ్జి కింద గల్లంతయ్యాడు. అతని తండ్రి గౌస్ పాషా ఫిర్యాదు మేరకు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తన బృందాలతో కలిసి వెతికినప్పటికీ అచూకీ లభించలేదు. దీంతో సోమవారం ఎన్డీఆర్ఎఫ్, ఫైర్, పోలీస్, రెవెన్యూ అధికారులు తమ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం మృతదేహం లభించింది. శవానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తన కొడుకు మృతికి సంబంధించి అతని మిత్రులపై అనుమానం ఉందని తండ్రి తెలిపారు.

ఆవులకు మత్తు మందు.. పోలీసులకు ఫిర్యాదు

సదాశివపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మేత మేసేందుకు వెళ్లిన ఆవులకు గుర్తుతెలియని వ్యక్తులు మత్తు ఇంజక్షన్ చేసి ఆవులను దొంగిలించడానికి యత్నించారని పట్టణానికి చెందిన శంకర్, కిష్టయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటాపూర్ గ్రామ శివారులో మేత మేసేందుకు వెళ్లిన తమ ఆవులకు గుర్తుతెలియని వ్యక్తులు మత్తు ఇంజక్షన్ చేయడంతో ఆవులు స్పృహ కోల్పోయి పడి ఉన్నాయన్నారు. స్థానికులు గమనించి ఆవులను కాపాడటంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంటి ఎదుట నిలిపిన బైకులకు నిప్పు

నారాయణఖేడ్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలో ఇళ్ల ముందు నిలిపి ఉంచిన రెండు బైకులకు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున నిప్పుపెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. దత్తాత్రేయ కాలనీలో రాథోడ్ సురేష్, మోహన్ చౌహాన్ ప్రతిరోజు లాగే ఆదివారం రాత్రి తమ బైకులను ఇళ్ల ఎదుట ఉంచి నిద్రపోయారు. మధ్యరాత్రి వీరి బైకుల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ తీసి వాటిపై చల్లి నిప్పంటించారు. శబ్దం రావడంతో యజమానులు బయటికి వచ్చి చూసేసరికి బైకులు దగ్ధమై ఉన్నాయి. సమీపంలోనే మధుకు చెందిన బైకును కూడా దగ్ధం చేయడానికి యత్నించినప్పటికీ, అందులో పెట్రోల్ లేకపోవడంతో పొదల్లోకి తోసి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

పడకేసిన పారిశుధ్యం

- అటకెక్కిన తడి-పొడి చెత్త సేకరణ
- అసైన్డ్‌భూమిలో వ్యర్థాల పారబోత
- నిరుపయోగంగా డంపుయార్డులు
- విజృంభిస్తున్న దోమలు, క్రిమికీటకాలు
- రోగాలబారిన ప్రజలు

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలవ్యాప్తంగా అనేక గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రజా ప్రతినిధుల పాలన ముగిసి, ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైనప్పటి నుంచి సమస్యలు పేరుకుపోయాయని, ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కంది మండల కేంద్రంలో సమస్య తీవ్రంగా ఉంది.

- కంది, సిద్దిపేట అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి)


కంది శివారులోని అసైన్డ్‌భూమిలో ఆదివారం పారబోస్తున్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు

గ్రామాల్లో తడి,పొడి చెత్త సేకరణ పూర్తిగా నిలిచిపోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారమే దర్శనమిస్తోంది. కందిలో దాతలు ఇచ్చిన బ్యాటరీతో నడిచే చెత్త సేకరణ రిక్షాలను మూలన పడేశారు. కనీసం మురుగు కాల్వలు పూడిక తీయించడం లేదని, బ్లీచింగ్ పౌడర్ చల్లి ఏడాది పైనే అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ప్రత్యేక పాలనలో గ్రామం అపరిశుభ్రంగా మారి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ట్రాక్టర్‌తో సేకరించిన చెత్తను గ్రామ శివారులోని అసైన్డ్ భూమిలో ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారు. అంతేకాకుండా, హోటళ్లు, దాబాల్లో మిగిలిన ఆహార వ్యర్థాలను డంపుయార్డు పక్కనే పారబోస్తున్నా పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆహార వ్యర్థాల బహిరంగ పారబోత

కంది-శంకర్‌పల్లి హైవే పక్కనే, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పక్కన డంపుయార్డు ఉన్నా, ఆరుబయటే ఆహార వ్యర్థాలను పారబోస్తున్నారు. డస్ట్‌బిన్‌లపై మూతలు లేకపోవడం, బ్లీచింగ్ పౌడర్ చల్లకుండా ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నివాసితులు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇక్కడ చెత్తను నెల రోజులకు ఒకసారి తగలబెడుతుండడంతో వాయు కాలుష్యం ఏర్పడతున్నది. అసైన్డ్ భూమి పక్కనే రిజిస్ట్రేషన్ కార్యాలయం, మైనార్టీ గురుకుల పాఠశాల కూడా ఉన్నాయి. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

నిరుపయోగంగా డంపుయార్డు

నాలుగు సంవత్సరాల క్రితం దాదాపు రెండున్నర లక్షలతో నిర్మించిన డంపుయార్డు ఇప్పుడు నిరుపయోగంగా మారింది. గ్రామంలో సేకరించిన తడి,పొడి చెత్తతో ఎరువులు తయారు చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలు అమలుకావడం లేదు. ఇప్పటివరకు ఒక్కరోజు కూడా చెత్తను ఉపయోగించి ఎరువును తయారు చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం డంపుయార్డు చుట్టూ చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండి వీధి కుక్కలకు అడ్డాగా మారింది.


కందిలో మూలకు పడిన చెత్త సేకరణ రిక్షాలు


సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో డ్రైనేజీ దుస్థితి

ప్రత్యేక పాలన అస్తవ్యస్తం

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధుల పాలన ముగిసి, ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైన నాటి నుంచి ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. సమస్యలపై ఎవరికి చెప్పాలో కూడా తెలియని స్థితి నెలకొంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని, గ్రామానికి ఒక మండల స్థాయి అధికారిని ప్రత్యేక పాలన అధికారులుగా నియమించారు. వీరు నెలకు మూడుసార్లు గ్రామాన్ని సందర్శించి స్థానిక అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ పరిపాలనపై సమీక్షలు నిర్వహించాల్సి ఉండగా, అది ఎక్కడా అమలుకావడం లేదు. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపించడంతో సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. గ్రామ పంచాయతీ స్థాయి అధికారులపై ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పనుల ఒత్తిడి కారణంగా వారు గ్రామాలను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ప్రత్యేక పాలన యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన జిల్లా పంచాయతీ శాఖ అధికారులు ఇతర పనులలో నిమగ్నమై ప్రజలను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఫసల్‌వాది గ్రామ శివారులో ఏర్పాటు చేసిన డంపుయార్డు


ప్రాణం ఆగం.. పంటలు నాశనం

సంగారెడ్డి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులో సంగారెడ్డి మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన డంపు యార్డు వల్ల గ్రామంలో ఉండలేని దుస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలల క్రితం పచ్చని పంట పొలాలతో రైతులు, ఆహ్లాదకర వాతావరణంలో ఫసల్‌వాది గ్రామం ఉండేదని, ఇప్పుడు డంపింగ్ యార్డుతో నిత్యం దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని పరిసరాల ప్రజలు మండిపడుతున్నారు. వర్షాలకు ఈ వ్యర్థాలు తడిసి ముద్దయి అందులోని నుంచి వస్తున్న నీరు పొలాలకు చేరి పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా దుర్వాసనతో వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల పాలవుతున్నామని వాపోతున్నారు. వృద్ధుల్లో తలనొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయని తెలిపారు. డంపు యార్డుని ఇక్కడి నుంచి ఇతర ప్రాంతానికి తరలించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త చెదారాన్ని వేరు చేసి రీ సైక్లింగ్ చేస్తామని చెబుతున్నా ఇక్కడ మాత్రం ఎలాంటి రీ సైక్లింగ్ చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి : గ్రామస్థులు

డంపు యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. డంపుయార్డును ఇక్కడి నుంచి తరలించాలని, లేకపోతే ఎప్పటికప్పుడు రీ సైక్లింగ్ చేపట్టాలన్నారు. దుర్వాసనను అరికట్టేందుకు పచ్చదనం పెంపొందించాలని, ముఖ్యంగా చెత్త నిర్వహణకు శాస్త్రీయ విధానాలు తీసుకురావాలని కోరుతున్నారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యమందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవన్నీ అధికారులు అమలు చేయని పక్షంలో ఇక్కడి నుంచి డంపుయార్డు తరలించేవరకూ పోరాడుతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

ప్రాథమిక అంశాలపై పట్టుతో విజయం

● సెయింట్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి


గౌరవ అతిథిని సత్కరిస్తున్న గీతం యాజమాన్యం

పటాన్‌చెరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక అంశాలపై మంచి అవగాహన ఏర్పరచుకుని, వాటిపై పట్టు సాధించడం విజయానికి తొలి మెట్టు అని సైయెంట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ బీ.వి.ఆర్. మోహన్ రెడ్డి అభివర్ణించారు. 'ఇంజనీరింగ్ ఒక మెరుగైన భవిష్యత్తు : ఆవిష్కరణ, బాధ్యత, ఉద్దేశం' అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ తొలి ఏడాది బీటెక్ విద్యార్థులను ఉద్దేశించి ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. విజయానికి ఆరు సూత్రాలున్నాయన్నారు. అవి ప్రాథమిక అంశాలపై పట్టు సాధించడం, ఆసక్తిగా ఉండడం, అర్థవంతమైన స్నేహాలను నిర్మించుకోవడం, నిర్భయంగా ప్రయోగాలు చేయడం, మెంటార్ల నుంచి మార్గదర్శనం పొందడం, ప్రపంచ పరిణామాల గురించి తెలుసుకోవడం అని పేర్కొన్నారు. సాంకేతికత వేగవంతం అవుతోందని, తనను తాను విస్తరించుకుంటూ సర్వవ్యాప్తి చెందుతోందని, ఇది భవిష్యత్తును రూపొందించుకోవడానికి విద్యార్థులకు అపారమైన అవకాశాలను సృష్టిస్తోందని చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి డాక్టర్ మోహన్ రెడ్డిని సత్కరించగా, గీతం తొలిఏడాది సమన్వయకర్త ప్రొఫెసర్ త్రినాథరావు ఆయనకు సహకరించారు.

వరదరాజపూర్ పురాతన ఆలయంలో కేసీఆర్ సతీమణి పూజలు


వరదరాజపూర్ ఆలయంలో శోభమ్మ

మర్కుక్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం వరదరాజాపూర్ గ్రామంలో ఉన్న పురాతన వరదరాజస్వామి వారి ఆలయంలో సోమవారం మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి సమీపంలోనే ఈ ఆలయం ఉంటుంది. గతంలో ఆలయ పునర్నిర్మాణానికి కేసీఆర్ రూ. 10కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో కొంతమేరకు ఆలయ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారు. పూర్తి స్థాయిలో పనులు జరగాల్సి ఉంది. ఇటీవల జరిగిన ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ప్రత్యేకంగా గోదాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం గోదాదేవి జన్మ నక్షత్రం కావడంతో కేసీఆర్ సతీమణి ఆలయానికి వెళ్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

నాగుల పంచమికి సర్వం సిద్ధం


కోటి పడగల సంతాన నాగదేవత

సిద్దిపేట కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం నాగుల పంచమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. సిద్దిపేట పట్టణంలోని విక్టరీ చౌరస్తా వద్ద ఉన్న పాములపుట్ట, శ్రీనివాస్ నగర్‌తో పాటుగా పలుచోట్ల, ఆలయాల వద్ద ఉన్న పుట్టల వద్ద మహిళలు పాలు పోసేందుకు తరలిరానున్నారు. గాడిచర్లపల్లిలో కొలువైన కోటి పడగల సంతాన నాగదేవతను దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ వ్యవస్థాపకులు కంకణాల (ఇటుక) దశరథం స్వామి ఆధ్వర్యంలో కోటిపడగల సంతాన నాగదేవతకు ప్రతి ఏటా శ్రావణమాసం నాగుల పంచమి సందర్భంగా నాగమ్మ జాతరను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ జాతరకు సిద్దిపేట జిల్లాతో పాటు హైదరాబాద్, సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, అదిలాబాద్ జిల్లాల నుంచి, అలాగే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి బోనాల సమర్పణ, పాలాభిషేకం, కుంకుమార్చన, అఖండ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయంలో కొలువై ఉన్న నాగలోక రక్షకుడైన శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు.


పెద్దకంజర్ల గ్రామంలో వివరాలు సేకరించిన అధికారులు

ప్రభుత్వ పథకాల అమలుపై కేంద్ర బృందం ఆరా

పటాన్‌చెరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామంలో కేంద్ర అధికారుల బృందం పర్యటించింది. మహిళా సంఘాలకు రుణాలు, ఉపాధి హామీ పథకం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, పింఛన్ల మంజూరు వంటి అంశాలపై ప్రత్యక్ష పరిశీలన చేశారు. ఎంతమందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని గ్రామ కార్యదర్శి అనితను కేంద్ర అధికారి సృజనరెడ్డి అడిగి తెలుసుకున్నారు. 13 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 200 మందికి పింఛన్లు, ఉపాధి హామీ పథకంలో 130 మందికి జాబ్‌కార్డులు ఇచ్చామని కార్యదర్శి వివరించారు. 36 మహిళా సంఘాలకు ఒక్కో సంఘానికి రూ.15లక్షల చొప్పున రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్‌గౌడ్, ఏఈ సంపత్, ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థలమున్నా.. భవనం లేదు..

● అద్దె భవనంలో శివ్వంపేట పోస్టాఫీస్

శివ్వంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌కు సొంత భవనం లేకపోవడంతో 30 ఏళ్లుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో పోస్టాఫీస్ నిర్వహిస్తుండంతో పత్రాలు భద్ర పరిచేందుకు వీలు లేకుండా పోయింది. పోస్టాఫీస్ కోసం ఉద్దేశించిన స్థలం ఖాళీగా ఉన్నప్పటికీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో ఖాతాదారులకు, ఉపాధి హామీ కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో 37 గ్రామ పంచాయతీలు, పలు తండాలు ఉన్నాయి. వీటిన్నిటికీ ఈ పోస్టాఫీసే దిక్కు. ఇటీవల మెదక్ పర్యటనకు వచ్చిన ఎంపీ రఘునందన్‌రావు పోస్టాఫీస్ భవన నిర్మాణం కోసం ఖాళీ స్థలం ఉన్నా.. అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని స్థానిక బీజేపీ నాయకుడు వినోద్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌కు సొంత భవనంతో పాటు.. ఇక్కడ సబ్ పోస్టాఫీస్ మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అద్దె భవనంలో నిర్వహిస్తున్న పోస్ట్ ఆఫీస్

జాతీయ మానవ హక్కుల కమిషన్ బహిరంగ విచారణ

● ఒక రోజులో రెండు డివిజన్ బెంచీలపై 100కుపైగా కేసులు

హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కుమారుడు అనుమానాస్పద మృతి చెందితే, పోలీసులు రోడ్డుప్రమాదంగా కేసు నమోదు చేశారంటూ ఓ తల్లి ఫిర్యాదు. ఆస్తి తగాదాలలో సొంత చెల్లెళ్లే అన్నను పొట్టన పెట్టుకున్నారంటూ మృతుడి భార్య ఆవేదన. అర్ధాంతరంగా ఉద్యోగంలో నుంచి తనను తొలగించారని ఓ యువకుడి రోదన. ఇలా ఒకటా, రెండా... భూకబ్జాలు, ఆస్తి తగాదాలు, లైంగిక దాడులు తదితర మానవ హక్కుల హననానికి సంబంధించిన వందకుపైగా కేసులను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం వేదికగా సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. డివిజన్ బెంచ్-1 లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ - 1లో 36 కేసులు విచారించారు. కమిషన్ సభ్యులు సాయని విజయభారతి, జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి నేతృత్వంలోని డివిజన్ బెంచ్-2లో మొత్తం 52కేసులు విచారణకు వచ్చినట్లు సమాచారం. ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలోనూ జైళ్లలోని పరిస్థితులు, బాధితులకు తగిన సమయంలో పరిహారం అందకపోవడం, కొన్ని కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులమీద సాయంత్రం వరకు విచారణ కొనసాగింది. తెలంగాణ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రవిగుప్తా, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్‌తో పాటు పలువురు ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు, జిల్లా పోలీసు అధికారులు పలు కేసుల నేపథ్యంలో విచారణకు హాజరయ్యారు.

బస్సుల కోసం విద్యార్థుల ధర్నా


కౌడిపల్లిలోని జాతీయ రహదారిపై బైఠాయించిన విద్యార్థులు

కౌడిపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బస్సులు రాకపోవడంతో నిత్యం 6 కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం బీజేపీ జిల్లా నాయకులు రాజేందర్ ఆధ్వర్యంలో వారు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, మండల పరిధిలోని వెల్మకన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెల్దుర్తి మండలంలోని అందుగులపల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది విద్యార్థులు లింగంపల్లి, కొట్టాల గ్రామాల మీదుగా నడిచి వస్తుంటారని అన్నారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ చదవాలంటే కౌడిపల్లికి రావాలన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో బాల్య వివాహాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. చిలప్‌చెడ్ మండలంలో శిలంపల్లి, సోమక్కపేట్, అంతారం తో పాటు తాండాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ చదవడానికి బస్సులు లేవని, దీంతో ఆటోలలో రావడం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇదే విషయంపై ఫోన్‌లో బీజేపీ నాయకులు మెదక్ ఆర్టీసీ డీఎంతో మాట్లాడారు. వెంటనే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. డీఎం సానుకూలంగా స్పందించడంతో ధర్నా విరమించారు.



మళ్లీ కొత్త ఓటరు జాబితా..!

గ్రామం యూనిట్‌గా రూపకల్పన
ఇప్పటికే మండల యూనిట్ పూర్తి
ఎంపీడీవోల లాగిన్ నుంచి టీ;పోల్ యాప్‌లో అప్‌లోడ్

మెదక్ అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా నిర్వహించడానికి వీలుగా ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా, ఇప్పుడు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని కొత్త ఓటర్ల జాబితాను తయారు చేయనున్నారు. ఇప్పటికే మండల స్థాయిలో ఓటర్ల జాబితా రూపొందించిన అధికారులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డుల వారీగా గ్రామస్థాయిలో జాబితాను సిద్ధం చేస్తున్నారు.

కుటుంబ ఓట్లు ఒకే వార్డులో

గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు వార్డుల్లో ఉండటంతో సమస్యలు తలెత్తాయి. ఈసారి ఆ సమస్యను నివారించడానికి, కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే వార్డులో ఉండేలా జాబితాను రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. ఇది ఓటర్లకు సౌలభ్యం కల్పించడంతో పాటు, ఎన్నికల ప్రక్రియలో గందరగోళాన్ని తగ్గిస్తుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఈ జాబితా తయారీ బాధ్యతను పర్యవేక్షిస్తారు.


ఓటరు జాబితా తయారీలో నిమగ్నమైన కార్యదర్శులు, సిబ్బంది

మండలం నుంచి గ్రామ స్థాయికి

గత ఫిబ్రవరిలో, ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పంచాయతీరాజ్ శాఖ మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఓటర్ల జాబితాను తయారు చేసింది. ఆయా గ్రామాల్లో వార్డుల వారీగా రూపొందించిన జాబితాలను ఎంపీడీవోలకు అందజేశారు. ఎంపీడీవోలు తమ లాగిన్ ద్వారా ఈ జాబితాను 'టీ-పోల్' యాప్‌లో అప్‌లోడ్ చేశారు. తాజాగా, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, వార్డుల వారీగా మరింత కచ్చితమైన జాబితాను తయారు చేయాలని ఆదేశాలు అందాయి. ఈ జాబితాను గ్రామ పంచాయతీ కార్యదర్శులు సిద్ధం చేసి, ఎంపీడీవోల ద్వారా డీపీవోకు సమర్పిస్తారు. ఈ జాబితాను ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు కూడా పరిగణనలోకి తీసుకుంటారు.

మార్పులు, చేర్పులకు అవకాశం

మెదక్ జిల్లాలోని 492 గ్రామ పంచాయతీల్లో 5.24 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. కొత్తగా ఓటర్లుగా నమోదైన వారి పేర్లను చేర్చడంతో పాటు, మరణించిన వారి పేర్లను తొలగించే ప్రక్రియ కూడా జరుగుతుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుంది. ఈ మార్పులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, గ్రామ స్థాయిలో కచ్చితమైన ఓటర్ల జాబితా సిద్ధం కానుంది.

ఓటర్ల జాబితా సిద్ధమవుతోంది: యాదయ్య, డీపీవో మెదక్

పంచాయతీ ఓటర్ల జాబితా కొత్తగా తయారు చేయాలని ఆదేశాలు వచ్చాయి. వార్డుల వారీగా సిద్ధం చేయాలని సూచించింది. అందుకనుగుణంగా చర్యలు చేపట్టాం. కార్యదర్శులు పనిలో నిమగ్నమయ్యారు. వార్డులోని ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా శ్రద్ధ వహిస్తున్నాం.

జిల్లా వివరాలు..

మొత్తం మండలాలు	21
గ్రామ పంచాయతీలు	492
పోలింగ్ కేంద్రాలు	4220
వార్డుల సంఖ్య	4220
ఎంపీటీసీలు	190
జడ్పీటీసీలు	21
మొత్తం ఓటర్లు	5.24.471
మహిళ ఓటర్లు	2,72,143
పురుష ఓటర్లు	2,52,319
ఇతర ఓటర్లు	9

ఆకట్టుకున్న బోధనోపకరణల ప్రదర్శన



సయ్యద్ సంధాని తయారుచేసిన బోధనోపకరణాలను చూపిస్తున్న ఎంఈవో ప్రభాకర్ రెడ్డి, అధ్యాపకులు

సిద్దిపేట కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర మల్టీపర్పస్ హైస్కూల్‌లో పాఠశాల సముదాయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ సయ్యద్ సంధాని తన వినూత్న బోధనోపకరణలతో శిక్షణార్థులను ఆలోచింపజేశారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా అట్టముక్కలతో వివిధ రంగుల తెలుగు పదాలను, సరళ, ఒత్తు పదాల రంగురంగుల దండలను తయారుచేసి ప్రదర్శించారు. మండల విద్యాధికారి రాజ ప్రభాకర్ రెడ్డి, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ సయ్యద్ సంధాని కృషిని అభినందించారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులు సయ్యద్ సంధాని కృషిని కొనియాడారు.



సయ్యద్ సంధాని తయారు చేసిన భోధనోపకరణాలు

ఎమ్మెల్యే పల్లా ఆర్థిక సాయం

చేర్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలకేంద్రానికి గీత కార్మికుడు కూరెళ్ల తిరుపతి (46) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం పట్ల సంతాపం వ్యక్తంచేస్తూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం ఆయన తరుపున స్థానిక బీఆర్ఎస్ నాయకులు మేడిశెట్టి శ్రీధర్, ముస్త్యాల నాగేశ్వర్‌రావు తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి నగదు అందజేశారు.

సోషల్ మీడియా నుంచి విరాళాలు

ఇటీవల తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయాలపాలైన గీత కార్మికుడు బూరగోని శ్రీనివాస్‌కు పలువురు ఆర్థికసాయం అందించారు. బూరగోని శ్రీనివాస్ దీనస్థితిని వివరిస్తూ సామాజిక సేవకులు అయిన రాము, తాహేర్ తదితరులు సోషల్‌మీడియాలో పోస్ట్ చేసి సేకరించిన విరాళాలు రూ.29,500నగదు, అలాగే హెల్పింగ్‌హ్యాండ్స్ ప్రతినిధులు సేకరించిన రూ.20,500 కలిపి మొత్తం రూ.50వేలని సోమవారం అతడికి అందజేశారు.

నిరుపేద కుటుంబానికి సహాయం

మిరుదొడ్డి, జూలై28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందె గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ కార్యకర్త రాయరపు ఎల్లయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆపార్టీ కార్యకర్తలు భూపాల్‌గౌడ్, కిష్టయ్య, శంకర్, బాలకిషన్‌లు 50కిలోల బియ్యాన్ని అందజేశారు. అలాగే పౌరహక్కులసంఘం ఉమ్మడి మెదక్‌జిల్లా అధ్యక్షుడు భూపతి 50కిలోల బియ్యాన్ని అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో తెగిపడిన యువకుడి కాలు

చిన్నకోడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : బోరు బండి (బోర్‌వెల్స్) టూల్ బాక్స్ డోరు తగలడంతో ఓ యువకుడి కాలు తెగిపడింది. ఈ సంఘటన సోమవారం రాత్రి చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకోడూరు గ్రామానికి చెందిన వర్కోలు రంజిత్ ద్విచక్ర వాహనంపై రాత్రి ఓ పని మీద గ్రామానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా సిద్దిపేట నుంచి చిన్నకోడూరు వైపు బోరు బండి వస్తుంది. బోరు బండి పరికరాలు ఇతర సామగ్రి భద్రపరిచే టూల్ బాక్స్ డోరు రంజిత్ కుడి కాలుకు తగిలింది. దీంతో కాలు మోకాలు వరకు తెగి రోడ్డుపై పడింది. పోలీసులు 108 సిబ్బందికి సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకుని రంజిత్‌ను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

కొండపాక, జూలై 28 (ఆంధ్రజ్యోతి):కొండపాక గ్రామానికి చెందిన ఎర్ర రాజుకు మంజూరైన ఈ ఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన రాజు అనారోగ్యానికి గురి కావడంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు.56 వేల రూపాయలు మంజూరు కావడంతో ఆ చెక్కును అందజేశారు

ఆలయ ఆవరణలో భక్తుడు మృతి

బెజ్జంకి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు గుండె పోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం బెజ్జంకిలో జరిగింది. మండలంలోని దాచారం గ్రామానికి చెందిన ఎగుర్ల మల్లేశం (62) అనే భక్తుడు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ్మ స్వామి దేవాలయానికి వచ్చాడు. దర్శనం చేసుకుని వెళ్తుండగా ఆలయ ఆవరణలో గుండె పోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలయ సిబ్బంది కుటుంబ సభ్యులకు సమాచారం అందిచగా మృతదేహన్ని తీసుకెళ్లారు.

ఆలయం మూసివేత

మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ్మ స్వామి దేవాలయ ఆవరణలో భక్తుడు మృతి చెందిన నేపథ్యంలో సోమవారం, మంగళవారం ఆలయాన్ని మూసి వేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ తెలిపారు. సంప్రోక్షణ అనంతరం బుధవారం నుంచి భక్తులకు దర్శనం ఉంటుందని తెలిపారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు మేలు

కుకునూరుపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని కుకునూరుపల్లి ఎంఈవో బచ్చలి సత్తయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో గ్రంథాలయాల నిర్వహణపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రంథాలయాలలో ఏ పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉండాలో, వాటి నిర్వహణ, వాటి ఉపయోగం గురించి వివరించారు. అనంతరం ఎంఈవో బచ్చలి సత్తయ్య మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి విజ్ఞానం పెంపొందించే విధంగా పాఠశాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణకు తగినన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో పుస్తకాలను చదివే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. వీటి ఆచరణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకుగాను బొబ్బాయిపల్లి ప్రధానోపాధ్యాయురాలు అశ్వినిని సత్కరించారు.

నోట్ బుక్స్ పంపిణీ

కొండపాక, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కొండపాకకు చెందిన శ్రీ రామదాసు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి విద్యాదాన్ సేవలో భాగంగా కొండపాక గ్రామంలోనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.3670 విలువగల నోటుబుక్స్‌ను దొడ్డం శిరీష బీవీ హరీష్ సహకారంతో సోమవారం అందజేశారు. అన్ని దానాలలో కన్నా విద్యాదానం గొప్పది అని మానవతా సేవ దృక్పథంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు వారి పేర్కొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్ నమోదు చేసుకోవాలి

- గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింలు
- 28మంది బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత



బాధితులకు ఫోన్లు అందిస్తున్న ఏసీపీ నర్సింలు

గజ్వేల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ నమోదు చేసుకోవాలని గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింలు సూచించారు. కొన్ని రోజుల నుంచి గజ్వేల్ డివిజన్ పరిధిలో పడిపోయిన, చోరీకిగురైన 28 ఫోన్లను బాధితులకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మట్లాడుతూ.. ఎక్కడైనా సెల్‌ఫోన్ పడిపోయినా, ఎవరైనా దొంగిలించినా వెంటనే సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రర్)లో ఫోన్ డేటాను నమోదు చేయాలని, తద్వారా రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. రికవరీ చేసిన 28 ఫోన్ల విలువ రూ.3లక్షల 30వేలుగా ఉంటుందని తెలిపారు. సెల్‌ఫోన్‌ను రికవరీ చేసిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. ఆయన వెంట గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, డివిజన్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు



రైతులకు సూచనలు చేస్తున్న ఏవో వసంతరావు

జగదేవ్‌పూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటలకు రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు సూచించారు. సోమవారం జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజుపేట గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంట ఆయన సందర్శించారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల నేపథ్యంలో ప్రస్తుతం పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పత్తి పంట శాఖీయ దశ నుంచి గూడ దశలో ఉందని, అక్కడక్కడ పారవిల్ట్ కనిపిస్తుందని, దీని వల్ల మొక్కల ఆకులు ఎండిపోయినట్లు కనిపిస్తాయని అన్నారు. దీని నివారణకు పొలంలో ఉన్న అధిక నీటిని మురుగు కాలువల ద్వారా బయటికి పంపించాలని, సాధ్యమైనంత వరకు వేర్లకు గాలి తగిలినట్లు చేయాలని తర్వాత లీటర్ నీటికి 5 గ్రాముల 19-19-19 గానీ లేదా 13-0-45, 3 గ్రాల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 1 గ్రాము కార్బండిజమ్ అనే మందును కలిపి మొక్కల వేర్లు తడిసేలా పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే పత్తిలో పిండినల్లి ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు 1.5 గ్రా ఎసిఫేట్ 75 ఎస్.పి లేదా 2 మి.లీ ఫిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పత్తిలో రెండవ దఫా నత్రజని ఎరువును 25 కిలోలు, పొటాష్ 15 కిలోలు ఒక ఎకరానికి వేసుకోవడానికి అనుకూలం అన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియా 1బై2 లీటరు పిచికారి మందులలో కలిపి వాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కిష్టయ్య, ఇతర రైతులు ఉన్నారు.

ఘనంగా గోదాదేవి తిరునక్షత్రోత్సవం



తిరునక్షత్రోత్సవ వేడుకలలో గోదాపారయణం చేస్తున్న భక్తులు

చేర్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో సోమవారం గోదాదేవి తిరునక్షత్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు మంగళగిరి శేషాచార్యులు శాస్త్రోక్తయుక్తంగా గోదాదేవి అమ్మవారికి విశేష పంచ సూక్త సహిత పంచామృతాభిషేకం జరిపారు. తిరువారాధన, దివ్యప్రబంధ సేవాకాల తనియ విన్నపం, గోదా పారాయణం చేపట్టారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకుని వేడుకున్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

సిద్దిపేట కల్చరల్/చేర్యాల/ములుగు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరుతూ, సీట్ల వివరాలను వెల్లడించారు. ములుగు మండలం తునికి బొల్లారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్‌లు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి అరుణ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో ఎంఎల్‌టీ కోర్సులో 15 సీట్లు, కంప్యూటర్ సైన్స్ కోర్సులో 28 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆరవ తరగతిలో కూడా 10 సీట్లు ఉన్నాయని ఆసక్తిగల విద్యార్థులు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేక అధికారి అరుణ కోరారు.

చేర్యాల కస్తూర్బాలో..

చేర్యాలలోని కస్తూర్బా జూనియర్ కళాశాలలో ఆంగ్ల మాధ్యమం సీఈసీ విభాగంలో ఖాళీగాఉన్న 20 సీట్ల భర్తీకి ఈనెల 30న స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నామని ప్రత్యేకాధికారి కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట కల్చరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని 23 కేజీబీవీలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం స్థానిక మండల కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు మంగళవారం స్థానికంగా ఉన్న కేజీబీవీకి హాజరుకావాలని చెప్పారు

కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజలు సుభిక్షం



పార్టీలో చేరుతున్న వారికి కండువాకప్పి ఆహ్వానించిన జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు సోమవారం పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన పార్టీ కండువాకప్పి ఆహ్వానించిన అనంతరం మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు ఎలాంటి మేలు చేకూరలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యస్థాపనకు సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేసి పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు. ఆకలిబాధలు తీర్చేందుకు సన్నబియ్యం అందించడంతో పాటు నూతన రేషన్ కార్డులు అందిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆడెపు చంద్రయ్య, పాల లక్ష్మీనారాయణ, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్, బందిగ రాకేశ్‌కృష్ణన్, నీలం సన్ని, అందె నాని, తాటికొండ సదానందం తదితరులు పాల్గొన్నారు.

వంద కిలోమీటర్ల రహదారులు మంజూరు

దుబ్బాక, జూలై28(ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజక వర్గంలోని వివిధ గ్రామాలకు సుమారు వందకిలోమీటర్ల రహదారుల ఏర్పాటుకు నిధులు మంజూరు అయినట్లు దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దుబ్బాక నియోజక వర్గంలోని సుమారు 28 గ్రామాలకు ఈరహదారుల మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. మల్లన్నసాగర్ నిర్మాణదశలో చెడిపోయిన రహదారులకు ఆర్‌అండ్‌బీ ద్వారా మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. దీనిపై ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ డీఈఈలు, ఏఈలతో సమీక్ష జరిపారు.

భాగస్వామ్య నిధులు లేకుండానే దేవాలయాలకు నిధులు

దుబ్బాక, జూలై28(ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజక వర్గంలోని దేవాలయల పునరుద్ధరణకు రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండసురేఖా కాంట్రీబ్యూషన్ నిధుల మినహాయింపుకు అంగీకరించారు. సోమవారం దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మంత్రిని అభ్యర్థించి, శిథిలావస్థలో ఉన్న కాశీవిశ్వనాథాలయం, లచ్చపేట రాజరాజేశ్వరాలయం, ధర్మాజీపేట సీతారామచంద్ర ఆలయాల జీర్ణోద్ధరణకు ఆయన నిధులను అభ్యర్థించారు. దీనికి దేవాదాయ శాఖకు సంబంధిత గ్రామాల ప్రజలు భాగస్వామ్యనిధిని దేవాలయానికి 10లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఆయా గ్రామాలల్లో భాగస్వామ్యనిధులను చెల్లించే స్థోమతలేదని శ్రీనివాస్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే భాగస్వామ్యనిధులను మినహాయిస్తున్నాననీ, ఆయా దేవాలయాలకు కాశీవిశ్వనాథ దేవాలయానికి 50లక్షలు, రాజరాజేశ్వరాలయానికి 50లక్షలు, సీతారామచంద్ర ఆలయానికి 47లక్షలు మంజూరీ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిపాదనల లేఖను దుబ్బాక కాంగ్రెస్ నాయకులు ఉప్పునూతుల ప్రవీణ్‌గౌడ్ మంత్రికి అందించగానే వెంటనే స్పందించారు. ఈసందర్భంగా మంత్రి కొండాసురేఖాకు, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి, స్వామి సమర్థమహారాజ్‌కు ప్రవీణ్‌గౌడ్ తోపాటు దుబ్బాక పట్టణ కాంగ్రెం నాయకులు శ్రీరాం నరేందర్‌లు కృతజ్ఞతలు తెలిపారు.



సీపీఐ నాయకులకు అందజేస్తున్న వినతి పత్రాలు

ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలి

- సీపీఐ డిమాండ్

కోహెడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో గతంలో ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చిన లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. సోమవారం గ్రామంలో మండల సీపీఐ కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇచ్చిన భూమిని పరిశీలించారు. సర్వేనెంబర్ 125, 129లో 47 మందికి పట్టా ప్రొసీడింగులు ఇచ్చారని తెలిపారు. గతంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాలేదని, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లు వచ్చినా.. అధికారులు అనుమతి ఇవ్వడం లేదన్నారు. వెంటనే అనుమతులు ఇవ్వకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బోనగిరి శంకర్, జాగిరి బాలయ్య, బూర రాజేశం, జాలిగం రాజయ్య, లబ్ధిదారులు సకినాల సారయ్య, వారపు రవీందర్ అపారపు రవీందర్, వడ్డేపల్లి రామచంద్రం, గుమ్మడి రామక్క, సత్తయ్య తదితరులున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న ప్రభుత్వం

బెజ్జంకి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం బెజ్జంకిలో నూతన రేషన్ కార్డుల ప్రొసిడింగ్ కాపీలు, కల్యాణలక్ష్మీ, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడ ఇవ్వలేదని రేషన్ కార్డులు ఇస్తే ప్రభుత్వం పై భారం పడుతుందని రేషన్ కార్డులను ఇవ్వకుండా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజా సంక్షేమం కోసం అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. పేదవాడి కల సాకారం చేసేందుకు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. రెండవ దశలో ఇళ్లు కట్టుకునేందుకు ఇంటి స్థలం లేనివారికి కూడ స్థలం ఇవ్వడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

మండలంలోని బేగంపేటలో ఉన్న సమస్యలను పరిష్కారించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన బెజ్జంకిలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా బేగంపేట గ్రామాన్ని గత ప్రభుత్వం 2016లో మండలంగా ఏర్పాటు చేస్తామన్నారు. బేగంపేట మండలాన్ని రద్దు చేయడమే కాకుండా బెజ్జంకి మండలాన్ని ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా సిద్దిపేట జిల్లాలో కలిపారని, తిరిగి బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలపాలని కోరారు.

మల్లన్న ఆలయంలో ఆడిటింగ్

కొమురవెల్లి, జూలై28 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సంబంధించిన 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను ఆలయ ఆదాయ, వ్యయాలకు సంబంధించిన జనరల్ ఆడిట్‌ను ఆడిటింగ్ అధికారులు సోమవారం ఆలయ కార్యాలయంలో చేపట్టారు. సోమవారం నిర్వహించిన వేలం పాట ద్వారా ఆలయానికి రూ.13 లక్షల ఆదాయం సమకూరింది. ఈవో కార్యాలయంలో ఈవో అన్నపూర్ణ అధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు.

పతి ఏటా విరాళం అందజేత

మర్కుక్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అంగడికిష్టాపూర్ మండల ప్రాథమికోన్నత పాఠశాలకు రెనో పాస్టర్ రబ్బర్ కంపెనీ అధినేత, మాజీ ఉమ్మడి మెదక్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మెన్ మొగిలి జనార్దన్‌రెడ్డి సౌండ్ సిస్టం అందజేశారు. ఇక నుంచి పాఠశాలకు ఏటా విరాళం అందజేస్తానని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ఏకరూప దుస్తులు క్రమశిక్షణ, స్వాగతం పలికే విధానం చూసి ఆయన ఆశ్చర్యం వక్తం చేశారు.

కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థినులు



విజయం సాధించిన శాశాను అభినందిస్తున్న డైనమిక్ ఫోటకన్ కరాటే ఆర్గనేజేషన్

వర్గల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ పట్టణంలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ విషయాన్ని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం భాస్కర్ తెలిపారు. మేడ్చల్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు పాల్గొన్నారని, అందులో బంగారు పతకాలు 4. వెండి పతకాలు 6, కాంస్య పతకాలు 6 సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రతిభను చాటిన విద్యార్థులను అభినందించారు. ఓవర్‌అల్ చాంపియన్‌షిప్‌గా శాశా అనే విద్యార్థిని సాధించినట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్‌తో పాటు ప్రతిభను చాటిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శాలిని, ఫిజికల్ డైరెక్టర్ లోకేశ్వరితో పాటు అధ్యాకబృందం అభినందించారు.

రామవ్వకెంత కష్టం..!


(3వ పేజీ తరువాయి)

ఆమె ఆరోగ్యం సహకరించకపోవడంతో ప్రతీ నెల ఆటోలో, చేర్యాపూర్‌కు చేరుకుని పింఛన్ తెచ్చుకుంటోంది. ఆమెకు వచ్చే మొత్తం పింఛన్ రూ.2000. అందులో సగం ప్రయాణ ఖర్చుకే పోతోంది. మిగిలిన డబ్బులతో మందులు, ఇతర అవసరాలు తీర్చుకోలేకపోతున్నది. అధికారులు స్పందించి.. తన పింఛన్‌ను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి బదిలీ చేయాలని వేడుకుంటున్నారు.

మండలం	జీపీలు	ఎంపీటీసీలు
అక్బరుపేట-భూంపలి	19	09
అక్కన్నపేట	38	12
బెజ్జంకి	24	10
చేర్యాల	20	12
చిన్నకోడూరు	28	14
దూళిమిట్ట	11	05
దౌల్తాబాద్	25	09
దుబ్బాక	21	10
గజ్వేల్	25	11
హుస్నాబాద్	17	06
జగదేవ్‌పూర్	25	10
కోహెడ	27	13
కొమురవెల్లి	11	06
కొండపాక	15	10
కుకునూరుపల్లి	14	05
మద్దూరు	10	06
మర్కుక్	16	07
మిరుదొడ్డి	10	07
ములుగు	26	10
నంగునూరు	25	11
నారాయణరావుపేట	11	05
రాయపోల్	19	08
సిద్దిపేట రూరల్	15	08
సిద్దిపేట అర్బన్	12	07
తొగుట	17	08
వర్గల్	27	11
మొత్తం	508	230

రిజర్వేషన్‌పై ఉత్కంఠ

(3వ పేజీ తరువాయి)



ఇటీవల హైకోర్టు సూచనలు చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు అడుగులు పడుతున్నాయి. అయితే ముందు గ్రామపంచాయతీ ఎన్నికలా..? ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలా..? అనే విషయంపై అస్పష్టత నెలకొంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నదనే సంకేతాలు వస్తున్నాయి.

ఆ మండలాలకు తొలిసారిగా..

2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 23 మండలాలు మాత్రమే ఉన్నాయి. ఆ తర్వాత ధూళిమిట్ట, కుకునూరుపల్లి, అక్బరుపేట-భూంపల్లి మండలాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. ఈ మూడు మండలాలకు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు కొలువు దీరనున్నారు. దీనికి సంబంధించిన గెజిట్ కూడా విడుదలైంది. ఇప్పటికే ఈ మండలాల్లో తహసీల్దార్‌తోపాటు ఇతర కార్యాలయాలు ఉన్నాయి. ఎన్నికల తర్వాత మండల పరిషత్ కార్యాలయాలు కూడా ఏర్పాటు కానున్నాయి. కొత్త మండలాలను దక్కించుకోవడానికి రాజకీయ పార్టీలు, ఆశావహులు కసరత్తు ప్రారంభించారు.

ఖర్చుకు తర్జనభర్జన..

ఓ పక్క ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నోటిఫికేషన్ ఏ క్షణంలో వచ్చినా సిద్ధంగా ఉండాలని బ్యాలెట్ బాక్సులు, ఇతర సౌకర్యాల విషయంలో అప్రమత్తం అవుతున్నారు. ఆశావహులు రిజర్వేషన్ల విషయంలో తలలు పట్టుకుంటున్నారు. ముందస్తుగా ఖర్చు పెట్టాలని ఉన్నా రిజర్వేషన్లు తారుమారైతే ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆలోచిస్తున్నారు. ఒకవేళ ఖర్చు పెట్టకుండా ఉంటే ప్రజల్లో పరపతి తగ్గుతుందని భావిస్తున్నారు. ఏం చేయాలో పాలుపోక రిజర్వేషన్ల కోసం పడిగాపులు పడుతున్నారు. రెండేళ్లుగా పోటీ చేయడానికి ఎదురు చూసేవాళ్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. రిజర్వేషన్లపై పూర్తి అంచనా ఉన్న కొంతమంది తమ భూములు, బంగారం తనఖా పెట్టి ఎన్నికల్లో ఖర్చు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.